నమస్తే తెలంగాణ
8 నిజామాబాద్ గురువారం 30 నవంబర్ 2023

# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## కేసీఆర్ పాలనలో పైరవీలే లేవు..



గతంలో భూములు పట్టా చేయించాలంటే చాలా పైరవీలు చేయాల్సి వచ్చేది. కానీ కేసీఆర్ వచ్చిన తర్వాత పైరవీకారులు, లంచాలు లేకుండా ధరణిలో పాస్‌పుస్తకాలు వస్తున్నయ్. రైతు సొంతంగా మీ సేవకు పోయి స్లాట్‌బుకింగ్ చేసుకుంటే పని అయిపోతున్నది. ఇంటికే పోస్టులో పాస్ పుస్తకాలు వస్తున్నాయ్. గతంలో నెలల తరబడి తిరిగినా మన పేరిట భూములను రిజిస్ట్రేషన్ చేసేది కాదు. ధరణితో అందరి భూములకు భద్రత వచ్చింది. చిన్న, సన్నకారు రైతులు భూమి పోతదనే భయం లేకుండా బతుకుతున్నరు. ఎట్టి పరిస్థితుల్లోనూ ధరణి ఉండాల్సిందే.

**-ఎం. నజీర్, రైతు, ధర్పల్లి**

## కాంగ్రెస్ వస్తే భూములు బీడు పెట్టాలె..



నాకు 25 ఎకరాల భూమి ఉంది. బీఆర్‌ఎస్ సర్కారు రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్ ఇవ్వడంతోనే మొత్తం సాగు చేస్తున్నం. 5 హెచ్‌పీ మోటరుతో రెండు, మూడు రోజులకోకసారి నీళ్లు పారిస్తా. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డికి వ్యవసాయం మీద కనీస అవగాహన లేకనే 3 గంటల కరెంటు సరిపోతుందని అంటున్నడు. వాళ్లు అధికారంలోకి వస్తే చాలా మంది రైతులు భూములను బీడు పెట్టుకోవాల్సి వస్తుంది చిన్న, సన్నకారు రైతులకు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకునే స్థోమత ఉండదు. రేవంత్‌రెడ్డి పనికి మాలిన మాటలు మాట్లాడటం సరికాదు. సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ రైతులకు ఉచితంగా ఇస్తుంటే.. కాంగ్రెసోళ్లు ఓట్ల కోసం రైతులతో రాజకీయం చేస్తున్నరు.

**-పీసు రాజారాం, రైతు ధర్పల్లి**

# కరెంటు ఉండాలంటే 'కారు' రావాలె..

- 'మూడు గంటల' కాంగ్రెస్ వద్దు
- 24 గంటల కరెంటిచ్చే బీఆర్‌ఎస్సే ముద్దు
- కాంగ్రెస్‌ను రానివ్వొద్దని స్పష్టం చేస్తున్న అన్నదాతలు
- 10 హెచ్‌పీ మోటర్లను మా నెత్తిన పెట్టొద్దు

## పట్వారీలు, కర్ణంల కాళ్లు పట్టుకోవాల్నా..



ధరణి పద్ధతి వచ్చినప్పటి నుంచి భూమి రిజిస్ట్రేషన్ కోసం మాలాంటి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోయాయి. మన భూమి గురించి తెలుసుకోవాలంటే ఇప్పుడు ధరణి పోర్టల్‌తో నా ఫోన్‌లోనే చూసుకుంటున్నం. గతంలో పట్వారీలు, కర్ణాల దగ్గరికి పోయి బతిమి లాడాల్సి ఉంటుండె. కాంగ్రెస్ వచ్చి ధరణిని తీసేస్తే భూము పట్టా చేసుకునడానికి మళ్లీ పట్వార్లు, కర్ణాల దగ్గరికి పోయి కాళ్లు పట్టుకోవాల్నా? చల్.. కాంగ్రెస్‌నే ఖతం చేస్తే చాలు.

**-సబావత్ శ్రీనివాస్‌నాయక్, రైతు భగవాన్ల తండా**

## ఓవర్ లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతయ్..



కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు మూడు గంటల కరెంట్‌తో పొలాలు పండవు. రైతులు బాగపడరు. మాకు 3 ఎకరాల పొలం ఉంది. ఇప్పుడున్న ప్రభుత్వం 24 గంటలు కరెంట్ ఇవ్వటంతో 5 హెచ్‌పీ మోటర్లను వాడుతున్నం. కాంగ్రెస్ 3 గంటల కరెంట్ ఇచ్చి, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టి నీళ్లు పారిచ్చుకొండి అంటున్నరు. రైతులందరూ ఒకేసారి 10 హెచ్‌పీ మోటర్లను ఆన్ చేస్తే ఓవర్ లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడికక్కడ పేలిపోతయ్. లో వోల్టేజీతో ఇండ్లళ్లకు కూడా సక్కగ కరెంటు రాదు. ఇంత మంచిగున్న 24 గంటల కరెంటును పాడుచేసుకోం.

**-జంగిటి పెద్ద పోసన్న, రైతు, సీతాయిపేట్, ధర్పల్లి**

## కాంగ్రెస్‌ది అంతా బ్రోకర్ల రాజ్యమే..



రేవంత్‌రెడ్డి ధరణిని తీసేస్తామంటున్నడు. కాంగ్రెస్‌ది అంతా బ్రోకర్ల రాజ్యమే. ధరణి వచ్చిన తర్వాత ఒకే దగ్గర రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ అయిపోతున్నాయి. రైతులకు రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టూ తిరిగే తిప్పలు తప్పాయి. ధరణి రద్దు చేస్తే పట్వారీలు, రిజిస్ట్రేషన్ కార్యాలయం, అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సి ఉంటుంది. అయినా సరిగ్గా పని కాదు. ఇప్పుడు కేసీఆర్ సార్ ముఖ్యమంత్రి అయ్యాక రిజిస్ట్రేషన్ అవస్థలన్నీ పోయాయి. కాంగ్రెస్ సర్కారు వస్తే మళ్లీ కష్టాలు మొదలవుతాయి. రైతులు బ్రోకర్లు, పటేండ్లు, పట్వారీల వెంట తిరిగి లంచాలు ఇవ్వాల్సి వస్తుంది.

**-ఎం.సేవ్యా, రైతు, చెరువు తండా, ధర్పల్లి మండలం**

## ఎవుసాన్ని ఆగం చేసుకోం..



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవు. అప్పట్ల కరెంట్‌తో గోస పడ్డ రోజులు మర్చిపోతమా? రాత్రిళ్లు బ్యాటరీ లైట్లు పట్టుకొని బాయిలకాడ కావలి ఉండేటోళ్లం. కరెంటు ఇట్ల అచ్చినట్టు అచ్చి.. దాని పాడుగాను బందయ్యేది. మళ్లా కరెంట కోసం కావలి కాసేది. ఆ రోజులు గుర్తొస్తేనే వణుకు పుడ్తది. తెలంగాణ వచ్చినంక 24 గంటలు కరెంటేనాయే. ఎప్పుడంటే అప్పుడు పోయి నీళ్లు వదులుతున్నం. కాలిన మోటర్లను ట్రాక్టర్ల తీసుకెళ్లే బాధ లేకుండా పోయింది. ఇప్పుడు మళ్లా కాంగ్రెస్‌కు ఓటేసి మా బతుకులను ఆగం జేసుకుంటమా.. రైతును బతికించిన బీఆర్‌ఎస్‌కే మా మద్దతు.

**-సోమ శేఖర్, రైతు, మైలారం, ధర్పల్లి మండలం**

## మస్తు ఇబ్బందులు ఎదుర్కొన్నం



కాంగ్రెస్ పాలనలో భూమి పట్టా చేసుకోవాలంటే పట్వారీతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నం. మాకు ఎకరంన్నర భూమి ఉంది. అప్పట్లో ఓ పట్వారీ 35 గుంటలు మాత్రమే పట్టాలో ఎక్కిచ్చిండు. మిగిలింది పట్టా కాలేదు. మొత్తం సాగు చేసుకుంటున్నా మాకు 35 గుంటలకే రైతుబంధు సాయం అందుతున్నది. ఇట్లా చాలా మంది భూములు సాగులో ఉన్నప్పటికీ పట్టాలకు ఎక్కించలేదు. కాంగ్రెస్ నాయకులు మళ్లా పాత పద్ధతే తీసుకొస్తామని అంటాండ్రు. వాళ్లు వచ్చేది లేదు.. చేసేది లేదు. ఎనకటి మనుషులు ఎనికటి వేషాలే ఏస్తరుగానీ, కొత్తగా ఏం ఆలోచిస్తరు. కాంగ్రెస్ వాళ్లతో రైతులకు ఇబ్బందులు ఉంటాయి.

**-ఎం. రాజేందర్‌రెడ్డి, రామడ్గు, ధర్పల్లి మండలం**